

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.21 ఆదివారం సాయంత్రం
సహరి: 4.50 సోమవారం ఉదయం



ఇక్కడా.. విదేశీ బ్రాండ్లు

కాకినాడ, రాజమహేంద్రవరంలో రెండు స్టోర్లు

- త్వరలో వాక్ ఇన్ మద్యం స్టోర్లు
- ఒక్కో దుకాణానికి రూ.కోటి ఫీజు
- ఏటా 10 శాతం లైసెన్స్ ఫీజు పెంపు
- దక్కించుకున్న ఇద్దరు వ్యాపారులు
- ఐదేళ్ల కాలపరిమితితో మంజూరు
- ఫారిన్ బ్రాండ్ల విక్రయానికి ఓకే
- గత వైసీపీలో పదికిపైగా షాపులు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

మందుబాబులకు ఇష్టమైన బ్రాండ్లు దొరికితే తెగ తాగేస్తారు.. అదే ఫారెన్ బ్రాండ్లు అంటే మరీ మోజు.. కానీ మన దగ్గర ఫారెన్ బ్రాండ్లు దొరకడం అసాధ్యం.. ఇప్పుడు ఫారెన్ బ్రాండ్లన్నీ ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాలోనే దొరకనున్నాయి. మెట్రోపాలిటిన్ సిటీల్లో అందుబాటులో ఉండే బ్రాండ్‌లు సైతం లోకల్‌గానే దొరికేస్తాయండోయ్.. అవునండి బాబూ నిజమే. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో రెండుచోట్ల రెండు వాక్ ఇన్ మద్యం స్టోర్లకు అనుమతిచ్చింది. వీటికి టెండర్లు పిలవగా ఇద్దరు వ్యాపారులు ఈ రెండు స్టోర్లను దక్కించుకున్నారు.. ఒక్కో స్టోర్‌కు ఏడాదికి లైసెన్స్ ఫీజు ఎంతో తెలుసా.. అక్షరాలా రూ.కోటి.. ఐదేళ్లపాటు లైసెన్స్ లభిస్తుండడంతో వీటిని ఎగరేసుకుపోయారు.. స్టోర్ దక్కించుకున్న వ్యాపారులు ఏటా లైసెన్స్ ఫీజుపై 10 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.. వీటికున్న డిమాండ్‌తో స్టోర్లను సదరు వ్యాపారులు ఎగరేసుకుపోయారు. కాకినాడ మెయిన్‌రోడ్డులో రాబోతున్న ఈ స్టోర్‌ను విజయవాడకు చెందిన ఓ వ్యాపారి.. రాజమహేంద్రవరంలోని ఏవీ అప్పారావు రోడ్డులో రాబోతున్న స్టోర్‌ను స్థానిక వ్యాపారి పోటీలో దక్కించుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ లైసెన్సు జారీ చేసింది. 45 రోజుల్లో ఇవి తెరుచుకోనున్నాయి. సాధారణ ప్రైవేటు మద్యం దుకాణంలో దొరికే అన్ని రకాల బ్రాండ్లతోపాటు విదేశీ సరుకు వీటిలో లభ్యం కావడం ప్రత్యేకత. వివిధ దేశాలకు చెందిన ప్రముఖ వైన్, విస్కీ బ్రాండ్లతోపాటు షాంపైన్ కూడా వీటిలో విక్రయించనున్నారు. చెప్పాలంటే ఫారెన్ బ్రాండ్లన్నీ దాదాపు వీటిలో దొరకనున్నాయి. ఏ విదేశీ బ్రాండ్ కావాలో సదరు వ్యాపారి లిక్కర్ డిపోకు ఆర్డరు ఇస్తే ఆ మందును స్టోర్‌లకు సరఫరా చేయనున్నారు. సాధారణ సూపర్ మార్కెట్ తరహాలో మద్యం ప్రియులు ఈ స్టోర్‌కు వెళ్లి సరుకులు కొనుగోలు చేసుకున్నట్టే వీటిని కొనుగోలు చేయవచ్చు. ఇదిలా ఉంటే గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పది వరకు వాక్ ఇన్ స్టోర్లను ఎక్సైజ్‌శాఖ నగరాలు, పట్టణాల్లో తెరిచింది. వీటిలో అప్పటి సర్కారు ఆదేశాలతో నాసిరకం మద్యం బ్రాండ్లను రెట్టింపు ధరకు విక్రయించి కొందరు ప్రభుత్వ పెద్దలు కోట్లలో సంపాదించారు. కానీ ఈ వాక్ ఇన్ స్టోర్లలో అన్ని ప్రముఖ కంపెనీలకు చెందిన విదేశీ బ్రాండ్లను విక్రయించనున్నారు. ఈ తరహా దుకాణాలకు రెండింటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

అధికారుల తీరు మారదా?

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధుల నిలదీత
- జిల్లా ఉన్నతాధికారుల గైర్హాజరు.. కాకినాడ కలెక్టర్ మాత్రమే హాజరు

7

అమరావతికి పవన్..

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జనసేన 12వ ఆవిర్భావ సభకు విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం కాకినాడ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరి అమరావతికి వెళ్లారు. ఉదయం 9.25 గంటలకు కాకినాడలో తాను బసచేసిన జీఆర్‌టీ గ్రాండ్ హోటల్ నుంచి బయటకు వచ్చారు. అక్కడ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి నుంచి బయలుదేరి జిల్లా పోలీస్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. అక్కడ వేచి ఉన్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలికి హెలీకాప్టర్ ఎక్కే వరకు ఉన్నారు. అనంతరం 9.45 గంటలకు హెలీకాప్టర్ అమరావతికి బయలుదేరింది. లక్షలాది మంది జనసేన కార్యకర్తలు, అభిమానుల రాకతో పార్టీ ఆవిర్భావ జయకేతనం సభ సూపర్ సక్సెస్ అవ్వడంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతోషంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సభను విజయవంతం చేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



పవన్‌కల్యాణ్‌కు వీడ్కోలు పలుకుతున్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్



గాలి.. పోతోంది!

నాడు స్థానికంలో అప్రజాస్వామికం..

కూటమి వైపు వైసీపీ నేతల చూపు

- ఫ్యాన్స్.. పక్కచూపులు
- ఖాళీ అవుతున్న వైసీపీ
- ఇప్పటికే తుని టీడీపీ కైవశం
- జనసేనలో నిడదవోలు చైర్మన్
- సైలెంట్‌గా కొవ్వూరు చైర్‌పర్సన్
- మిగిలిన పురాలదీ అదే పరిస్థితి
- జడ్పీటీసీలు..సర్పంచ్‌ల క్యూ
- జూన్‌లో కార్పొరేషన్ ఎన్నికలు
- స్థానిక పట్టునకు ప్రయత్నాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఫ్యాన్ 'గాలి' పోతోంది.. ఎటువైపు వీలుంటే అటువైపు పోతోంది.. అధికారం ఉన్నప్పుడు విర్రవీగిపోయిన వైసీపీ గణం.. అధికారం పోవడంతో నెమ్మదిగా సర్దుకుంటోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు కొవ్వూరు డివిజన్‌లోనూ కూటమి పార్టీలు క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం వైసీపీ ఊసే వినిపించలేదు. దీంతో ఆ పార్టీ నేతలతోపాటు, కార్యకర్తలు రోజురోజుకు దిగజారుతున్న పార్టీ పరిస్థితి చూసి మెల్లగా జారుకుంటున్నారు. గాలివీయని పార్టీలో ఇక ఎందుకు ఉక్కబోత తప్ప అని కూటమి వైపు అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా స్థానిక సంస్థలైన పంచాయతీలు, మునిసిపాలిటీలు, జడ్పీలో ఉన్న వైసీపీ ప్రతినిధులు నెమ్మదిగా జారుకుంటున్నారు. వివిధ కారణాలతో ఆదిలోనే కొవ్వూరుకు చెందిన రాజీవ్‌కృష్ణ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మరికొందరు అదే బాటలో ఉన్నారు. వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముందుగానే తప్పుకోవడం మంచిదనే నిర్ణయానికి వస్తున్నారు. కాకినాడ జిల్లాలోని తుని మునిసిపాలిటీయే అందుకు ఉదాహరణ. టీడీపీకి అక్కడ ఒక్క సీటు లేకపోయినా వైసీపీ కౌన్సిలర్లంతా టీడీపీలో చేరిపోయారు. దీంతో తుని మునిసిపాలిటీ టీడీపీ ఖాతాలో పడింది. అభివృద్ధి కార్యక్రమాలతోపాటు తమ రాజకీయ భవిష్యత్తు కోసం వారంతా ఇటు పయనించారని ఎవరికైనా అర్థమవుతుంది. అదే పరిస్థితి నిడదవోలులోనూ పునరావృత్తం కానున్నట్టు సమాచారం. ఇప్పటికే అక్కడ చైర్మన్ జనసేనతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు. పదిమంది కౌన్సిలర్లతో వెళ్లి మంత్రి దుర్గేష్ సమక్షంలో జనసేన కండువా కప్పుకున్నారు. వచ్చే కౌన్సిల్ సమావేశంలో నిడదవోలు జనసేన వశమయ్యే అవకాశాలున్నట్టు సమాచారం. ఇక కొవ్వూరులోనూ ఇలాగే ఉంది. చైర్మన్ ఇప్పటికే గౌరవం లభించడంలేదని పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కేవలం మునిసిపల్ కార్యక్రమాలకే హాజరవుతున్నారు. కొవ్వూరులో ఇదే పరిస్థితి నెలకొన్నట్టు తాజా సమాచారం. కొవ్వూరులో ఇప్పటికే ఏడుగురు టీడీపీ కౌన్సిలర్లు ఉండగా మరో 8 మంది వెళితే కొవ్వూరు టీడీపీ వశమవుతోంది. దీంతో పలువురు 'ఫ్యాన్' కౌన్సిలర్లు టీడీపీ వైపు చూస్తున్నట్టు తెలిసింది.

కూటమికి కలిసొచ్చే కాలం..

వచ్చే ఏడాది వరకూ స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ఉంది. కానీ నాలుగేళ్లు పూర్తయిన తర్వాత మునిసిపల్ చైర్మన్లు, సర్పంచ్‌లు, జడ్పీ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెట్టే అవకాశం ఉండడం కూడా కూటమికి కలిసొచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే సర్పంచ్ పాలకవర్గాలకు నాలుగేళ్లు నిండాయి. మార్చి నెలతో మునిసిపల్ పాలకవర్గాలకు నాలుగేళ్లు నిండిపోతాయి. సెప్టెంబరులో జడ్పీలకు నాలుగేళ్లు నిండిపోతాయి. అధికారంలో ఉన్న పార్టీలకు స్థానికంగా బలం ఉంటుంది కాబట్టి స్థానిక ప్రజాప్రతినిధులంతా అటువైపే మొగ్గు చూపడం సహజం. దీంతో వైసీపీలో భారీగా వలసలు తథ్యం.

2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అప్రజాస్వామికంగా, దౌర్జన్యకరంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ప్రతిపక్ష పార్టీలను నామినేషన్లు వేయనివ్వని పరిస్థితి. దీంతో అన్ని మునిసిపాలిటీల్లోనూ వైసీపీనే విజయం సాధించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 12 మునిసిపాలిటీల్లో అప్పట్లో వైసీపీకి 319 మంది కౌన్సిలర్లు, టీడీపీకి 50, జనసేనకు 18, బీజేపీకి 8, కాంగ్రెస్ తరపున ఒక కౌన్సిలర్ ఎన్నికయ్యారు. ఇప్పటికే చాలామంది పార్టీ మారిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం, కాకినాడ కార్పొరేషన్లకు వైసీపీ ఎన్నికలు నిర్వహించడానికి భయపడిన సంగతి తెలిసిందే. ఎందుకంటే అప్పటికే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మరోవైపు రెండు కార్పొరేషన్లు టీడీపీ కంచుకోటలు కావడంతో ఎన్నికల దిశగా ఆలోచించడమే మానుకుంది. ఐదేళ్లు ఎన్నికలు నిర్వహించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ప్రభుత్వం కార్పొరేషన్లకు జూన్‌లో ఎన్నికలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. వాటితోపాటు మొత్తం మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అనేది ఇంకా స్పష్టత కావలసి ఉంది. 2021 ఫిబ్రవరి 9 నుంచి 21వ తేదీ వరకూ పంచాయతీ ఎన్నికలు 4 దశల్లో జరిగాయి. ఆ ఎన్నికల్లో వైసీపీకి 805 సర్పంచ్ పదవులు రాగా, టీడీపీ, మిత్రపక్షాలకు 143 లభించాయి. అందులో ఇప్పటికే చాలామంది కూటమిలో చేరిన సంగతి తెలిసిందే. జడ్పీ ఎన్నికలు వాస్తవానికి 2020లో మార్చిలో జరగాలి. కరోనా వల్ల వాయిదా పడ్డాయి. 2021 ఏప్రిల్ 8వ తేదీన ఎన్నికలు నిర్వహించగా 2021 సెప్టెంబరు 19న ఫలితాలు ప్రకటించారు. వచ్చే సెప్టెంబరుకు నాలుగేళ్లు పూర్తవుతుంది. ఇప్పటికే చాలామంది జడ్పీటీసీలు కూటమిలో చేరగా కొందరు జడ్పీటీసీలు సైలెంట్ అయ్యారు. కొద్దిరోజుల్లో స్థానికంగా ఇంకా మార్పులు రానున్నాయి.

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' దిశగా కృషిచేయాలి

- జిల్లా ఇన్‌చార్జి అధికారి వీరపాండ్యన్, కలెక్టర్ షాన్‌మోహన్
- కాకినాడలో సైకిల్ తొక్కిన కలెక్టర్, ఇన్‌చార్జి అధికారి.. ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్సీ



స్వచ్ఛాంధ్రపై అవగాహనకు కాకినాడ కలెక్టరేట్‌నుంచి సైకిల్ తొక్కుతూ వెళ్తున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి వీరపాండ్యన్, కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్, కమిషనర్ భావన తదితరులు



స్వచ్ఛ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, చిత్రంలో కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జి అధికారి

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇకపై ప్రతినెలా మూడో శనివారం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించనుంది. ఇందులోభాగంగా కాకినాడ కలెక్టరేట్‌నుంచి కొండయ్యపాలెం శారదాదేవిగుడి సెంటర్ వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జిల్లా ఇన్‌చార్జి అధికారి వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సైకిల్ ర్యాలీలో జిల్లా ఇన్‌చార్జి అధికారి, జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ తదితరులు ఉత్సాహంగా పాల్గొని సైకిల్ తొక్కారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి అధికారి వీరపాండ్యన్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ దిశగా ప్రధాని మోదీ, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర దిశగా సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు పరిశుభ్రతను అలవాటుగా చేసుకోవాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఈనెల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడడం తగ్గించడం.. తద్వారా ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతిఒక్కరూ పాఠశాలలోను, తమ గ్రామంలో, తమ ఇంటివద్ద స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నాలన్నారు. కొండయ్యపాలెం శారదాదేవిగుడి సెంటర్‌వద్ద ప్లాస్టిక్ వాడకంవల్ల జరిగే అనర్థాలు, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన ఏర్పాటు చేసి స్టాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛతా ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో జిల్లా జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, డీఆర్వో వెంకట్రావు, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ సుధాకర్, టౌన్ ప్లానింగ్ అధికారి రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు అమరజీవి జయంతి

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఅవతరణ మూలపురుషుడు అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతివేడుకలు కాకినాడలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 10గంటల కు కాకినాడ కలెక్టరేట్ సమీపంలోని చర్చ్ సెంటర్‌లో కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ముగిసిన ఇంటర్ సెకండియర్ పరీక్షలు

కాకినాడ రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 3న ప్రారంభమైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు శనివారం ముగిశాయి. కెమిస్ట్రీ-2, కామర్స్-2, ఒకేషనల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగిన పరీక్షలకు జనరల్ విద్యార్థులు 18,027మంది హాజరుకావాల్సి ఉండగా 17,529మంది హాజరయ్యారని 498మంది పరీక్ష రాయలేదన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 1138మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1069మంది హాజరయ్యారని 91మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో తెలిపారు.

నేడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లకు పరీక్షలు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం, సోమవారాల్లో రెండురోజులపాటు నిర్వహించనున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ కంప్యూటర్ బేస్డ్ పరీక్షలకు సంబంధించి శనివారం పరీక్షా కేంద్రాన్ని కాకినాడ డీఆర్వో వెంకట్రావు పరిశీలించారు. కాకినాడ ఎస్.అచ్చుతాపురం అయాన్ డిజిటల్ జోన్ సాఫ్ట్ టెక్నాలజీస్ పరీక్షా కేంద్రాన్ని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, ఇతర అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో జిల్లాలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 655మంది, సోమవారం ఉదయం 9.30గంటలనుంచి మధ్యాహ్నం 12గంటలవరకు, మధ్యాహ్నం 2.30గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు 464మంది ఈ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఏపీపీఎస్సీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆవిర్భావ సభ చరిత్రలో నిలిచిపోతుంది



సమావేశంలో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్, కౌడా చైర్మన్ తుమ్మల బాబు

- అందరి సహకారంతో సభ విజయవంతం
- జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి, ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

పిఠాపురంరూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చిత్రాడ శివారులో నిర్వహించిన 12వ ఆవిర్భావ సభ చరిత్రలో నిలిచిపోయేలా జరిగిందని, నభూతో అన్నరీతిలో ఏర్పాట్లుఉన్నాయని ఏపీ టిడ్కో చైర్మన్, జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ తెలిపారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో శనివారం జనసేన జిల్లాఅధ్యక్షుడు, కౌడా చైర్మన్ తుమ్మలబాబు, పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆవిర్భావసభ సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ కోసం కనివినీ ఎరగని రీతిలో ఏర్పాట్లు చేయడంతో ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చిన వారికి ఏ ఇబ్బందిలేకుండా చూశారన్నారు. వారందరికీ అద్భుతంగా ఆతిథ్యం అందించారని తెలిపారు. సభ విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. జనసేన జిల్లాఅధ్యక్షుడు తుమ్మలబాబు మాట్లాడుతూ ఆవిర్భావసభ విజయవంతానికి 500మంది సభ్యులతో 14కమిటీలను ఏర్పాటు చేయడంతోపాటు పకడ్బందీప్రణాళికతో ముందుకు నడిపించారని తెలిపారు. పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారందరినీ అధినేత గుర్తిస్తారన్నారు. సమావేశంలో జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, డాక్టర్ పిల్లా శ్రీధర్, పంచకర్ల సందీప్, మురాలశెట్టి సునీల్ కుమార్, చల్లా లక్ష్మి పాల్గొన్నారు.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

- విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలి
- డీఈవో పిల్లి రమేష్
- జిల్లాలో హాజరుకానున్న 28,963మంది విద్యార్థులు
- 142 పరీక్షా కేంద్రాల కేటాయింపు, ఆ సెంటర్లవద్ద 144 సెక్షన్ అమలు

కాకినాడ రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్ అన్నారు. ఈనెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయన ఛాంబర్‌లో శనివారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలో పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షలు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయని తెలిపారు. కాకినాడ జిల్లాలో ఈ పరీక్షలకు 142 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాసేందుకు 28,963మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు.విద్యార్థులు తమతోపాటు హాల్ టికెట్లను తీసుకువెళ్లాలని అత్యవసర పరిస్థితుల్లో మినహా 12.45గంటల వరకూ పరీక్షా హాల్ నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించరని తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, 32 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ఈనెల 31 వరకూ జరుగుతాయని విద్యార్థులు ఎలక్ట్రానిక్‌పరికరాలను పరీక్షాకేంద్రాల్లోకి తీసుకువెళ్లేందుకు అనుమతిలేదన్నారు. సందేహాలుంటే 90003 99069 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. హాల్‌టికెట్లను మన మిత్ర యాప్ వాట్సాప్ ద్వారా పొందవచ్చన్నారు.

- ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా నిర్వహించే ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు కూడా సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. ఈ పరీక్షలకు కాకినాడ జిల్లాలో ఏర్పాటు చేసిన 26 పరీక్షా కేంద్రాల్లో 2248మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి వి.వెంకట్రావు, ఏసీఈ రాజశేఖర్, సార్వత్రిక విద్య జిల్లా సమన్వయకర్త పి.సాయి వెంకటరమణ పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి: జిల్లా ఇన్‌చార్జి అధికారి వీరపాండ్యన్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కాకినాడ జిల్లా ఇన్‌చార్జి అధికారి వీరపాండ్యన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం ఆయనతోపాటు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, జిల్లా అటవీఅధికారి రవీంద్రనాథ్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ భావన కలిసి వివిధశాఖల జిల్లాస్థాయి అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాఇన్‌చార్జి అధికారి వీరపాండ్యన్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, దీపం-2, పింఛన్ల పంపిణీ, హౌసింగ్, పరిశ్రమల స్థాపన లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతినెల రెండురోజులు జిల్లాకు వచ్చి అధికారులతో సమీక్షతోపాటు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తామన్నారు. డీఆర్వో వెంకట్రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు,శ్రీరమణి,పాడా పీడీ చైత్రవర్షిణి, సీపీవో త్రినాథ్, రాజకీయపార్టీల ప్రతినిధులు సాయిబాబు, వెంకటేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

మీరూ అవుతారా.. సైంటిస్ట్!



ఇస్రో అంతరిక్ష ప్రయోగాలు (ఫైల్‌ఫొటో).. అంతరిక్ష జిజ్ఞాస పోస్టర్ (కింద)

- జిజ్ఞాసను, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు 'ఇస్రో' యంగ్ సైంటిస్ట్స్ కార్యక్రమం
- 9వ తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం
- రిజిస్ట్రేషన్‌కు ఈనెల 23వ తేదీ వరకు గడువు
- అంతరిక్ష పరిశోధనలపై ఏడు కేంద్రాల్లో శిక్షణ



సైన్స్ పట్ల ఎన్నో ఆలోచనలు.. అందుకే ఇస్రో కార్యక్రమం

హైస్కూల్ స్థాయిలో పిల్లలను పెద్దయ్యాక ఏమవుతావ్ అంటే.. ఎక్కువ మంది పిల్లలు సైంటిస్ట్ అవుతానని చెబుతారు. ఎందుకంటే వారికి అప్పుడే సైన్స్ సంబంధ విషయాలపై బోధన జరుగుతూ ఉంటుంది. దాంతో సహజంగానే వారికి తెలుసుకోవాలన్న ఆసక్తి పెరుగుతుంది. శూన్యంగా కనిపిస్తున్న అంతరిక్షంలో ఎన్నో వింతలు ఉన్నాయి. అసలు అంతరిక్షంలో ఏం జరుగుతుంది.. అంతరిక్షంలోకి పంపించిన రాకెట్లు, శాటిలైట్ల ద్వారా శాస్త్రవేత్తలు ఏమి తెలుసుకుంటున్నారు అన్న ఆసక్తి విద్యార్థుల మెదడును తొలుస్తూ ఉంటుంది. అందులోనూ అంతరిక్షంపై ఆసక్తి ఉన్నవారికి మరీ ఎక్కువ. అటువంటి విద్యార్థుల కోసం 'యువికా' ఆధ్వర్యంలో అంతరిక్ష విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకునేందుకు అవకాశం కల్పించింది. అంతరిక్ష పరిశోధనలపై ప్రాథమిక పరిజ్ఞానం కల్పించేందుకు యువికా-2025 (యంగ్ సైంటిస్ట్) కార్యక్రమాన్ని భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రూపొందించింది. 2024-25 సంవత్సరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనా కేంద్రాల పర్యటనకు అవకాశం కల్పించారు. ఈనెల 23వ తేదీలోగా విద్యార్థులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

బాల శాస్త్రవేత్తల కోసం...

పాఠశాల స్థాయిలో సైన్స్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఎందరో ఉన్నారు. వారు తమ సృజనాత్మకతకు పదునుపెడుతూ నూతన ఆవిష్కరణలు చేపడుతున్నారు. రూపొందించిన పలు ప్రాజెక్టులతో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ ప్రశంసలు అందుకుంటున్నారు. అటువంటి ప్రతిభావంతులను భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా)ను అంతరిక్ష పరిశోధనా సంస్థల సందర్శనను ఇస్రో చేపట్టింది.

ప్రతిభావంతులకు ఆన్‌లైన్ క్విజ్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు యువికాకు అర్హులు. ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 48గంటల్లో ఇస్రో ఆన్‌లైన్ క్విజ్ నిర్వహిస్తుంది. క్విజ్ పూర్తి అయిన తర్వాత యువికా పోర్టల్‌లో ఓ విద్యార్థి పూర్తి వివరాలు నమోదు చేయాలి. విద్యార్థి సాధించిన ప్రగతికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలను జతపరచాలి. క్రీడలు, స్కౌట్ అండ్ గైడ్, ఎన్‌సీసీ, గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్నవారికి ప్రత్యేక మార్కులు కేటాయిస్తారు. ఎంపికైన విద్యార్థులకు భోజన, వసతి రవాణా ఖర్చులను ఇస్రోయే భరిస్తుంది. ఎంపికైన విద్యార్థితోపాటు తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ టీచర్‌కు కూడా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. శిక్షణ అనంతరం శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకువెళ్లి అక్కడి విశేషాలను విద్యార్థులకు వివరిస్తారు.

శిక్షణకు ఏడు కేంద్రాలు ఎంపిక..



అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు ఏడు కేంద్రాలను ఎంపిక చేశారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఐఐఆర్ఎస్ డెహ్రాడూన్, శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో తొలి విడతగా ఏప్రిల్ 7న మొదటి జాబితా విడుదల చేస్తారు. యువికాకు ఎంపికైన విద్యార్థులు మే 18న రిపోర్టు చేయాల్సి ఉంటుంది. మే 19 నుంచి 30వ తేదీ వరకు వారికి నిర్దేశించిన కేంద్రాల్లో అంతరిక్ష పరిశోధనలు, ఇతర అంశాలపై శిక్షణ ఇస్తారు.



భవిష్యత్తు శాస్త్రవేత్తలకు చక్కని అవకాశం

ఇస్రో ఆధ్వర్యంలో చేపట్టిన యువ విజ్ఞాన కార్యక్రమం విద్యార్థులను భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చక్కని అవకాశం కల్పిస్తోంది. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకునేలా సైన్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. పాఠశాల స్థాయి నుంచే శాస్త్ర ప్రయోగాలతో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన బాలశాస్త్రవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- గిరిజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా సైన్స్ అధికారి

- అమలాపురం రూరల్



జ్యోతిప్రజ్వలన చేసి టెక్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, అతిథులు

టెక్ ఫెస్ట్‌లతో సాంకేతిక విజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలి

- రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉపాధ్యక్షుడు వేణుగోపాలరాజు
- కాకినాడ జేఎన్టీయూలో జాతీయ స్థాయి సింపోజియం ప్రారంభం

జేఎన్టీయూకే, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): టెక్ ఫెస్ట్‌ల ద్వారా విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆయిల్, గ్యాస్ విభాగం ఇంజనీరింగ్ సర్వీసెస్ ఉపాధ్యక్షుడు వి.వేణుగోపాలరాజు పేర్కొన్నారు. వర్శిటీలోని యూసీఈకే ఈఈఈ, మెకానికల్, ఈసీఈ, సీఎస్ఈ, పీఈ, సీఈ విభాగాలు జాతీయ స్థాయి సింపోజియం టెక్ ఫెస్ట్‌ను రెండు రోజులు నిర్వహించనున్నాయి. వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో టెక్‌ఫెస్ట్ ప్రారంభోత్సవాన్ని ప్రిన్సిపాల్ మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేణుగోపాలరాజు, విశిష్ట అతిథిగా ఉప కులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్, అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఐదు విభాగాల సావనీర్లను, సీడీలను వారు ఆవిష్కరించారు. వేణుగోపాలరాజు మాట్లాడుతూ వినూత్న ఆవిష్కరణలు, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు, స్టార్టప్‌లకు టెక్‌ఫెస్ట్‌లు వేదికగా నిలుస్తాయన్నారు. వైస్ చాన్సలర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో ఇండస్ట్రీ 5.0 విప్లవం నడుస్తోందని, ఇది పారిశ్రామీకరణ అభివృద్ధి చెందుతున్న దశ అని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రాజెక్టులు, పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. డైరెక్టర్లు, హెచ్‌వోడీలు, వైస్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు సంబంధించి రూపొందించిన ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

త్వరలోనే ప్రేక్షకుల ముందుకు మెగాస్టార్ విశ్వంభర

'ఆంధ్రజ్యోతి'తో చిత్ర దర్శకుడు మల్లిడి వశిష్ట



అనపర్తి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సోషల్ ఫాంటసీ మూవీ 'విశ్వంభర' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోందని చిత్ర దర్శకుడు మల్లిడి వశిష్ట వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలో సోమాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు శనివారం వచ్చిన ఆయన మల్లిడి సురేంద్రరెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా కొద్దిసేపు 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. తన తొలి చిత్రం బింబిసార ప్రేక్షకులను ఆకట్టుకుందని, రెండో చిత్రం మెగాస్టార్ చిరంజీవితో చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సినిమా షూటింగ్ పూర్తి చేసుకుందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందన్నారు. బింబిసార పార్ట్-2 గురించి ప్రస్తావించగా... ఆ చిత్రాన్ని ఇప్పటికే వేరే నిర్మాతలు వేరే దర్శకుడితో తీస్తున్నట్టు ప్రకటించారని తెలిపారు. ఇండస్ట్రీకి హీరోగా వచ్చి తర్వాత దర్శకుడిగా ఎలా మారారని ప్రశ్నించగా.... తనకు ముందు నుంచీ కథలపై మక్కువ ఎక్కువని, కొత్త తరహా కథలను తెరకెక్కించాలన్న తపనతో దర్శకుడిగా మారినట్టు చెప్పారు. సోమాలమ్మ తీర్థం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో కొద్దిసేపు ముచ్చటించారు. అక్కడి నుంచి వశిష్ట స్వగ్రామమైన బిక్కవోలు మండలం తొస్సిపూడి వెళ్లారు.



సోమాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న సినీ దర్శకుడు వశిష్ట

మా తాతయ్యది ధవళేశ్వరమే..

- హీరోయిన్ శ్రీలీల
- రాజమండ్రి నాకు సెంటిమెంట్: హీరో నితిన్
- రాబిన్‌హుడ్ చిత్రం యూనిట్ సందడి



హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల, దర్శకుడు వెంకీ

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి15(ఆంధ్రజ్యోతి): తనకు రాజమండ్రి బాగా పరిచయమున్న నగరమని, తన తాతయ్య ధవళేశ్వరంలో ఉండేవారని హీరోయిన్ శ్రీలీల చెప్పారు. వెంకీ కుడుముల దర్శకత్వంలో హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల నటించిన రాబిన్‌హుడ్ చిత్రం ఈ నెల 28న విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా ప్రమోషన్ కోసం చిత్రం యూనిట్ రాజమహేంద్రవరం వచ్చింది. శనివారం మంజీరా హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో శ్రీలీల మాట్లాడుతూ ఈ సినిమాలోని పాత్ర తనకెంతో నచ్చిందని, పేక్షకులను బాగా అలరిస్తుందన్నారు. రాజమండ్రిలో రోజ్‌మిల్క్ తనకు చాలా ఇష్టమని చెప్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. హీరో నితిన్ మాట్లాడుతూ ఈ చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకొనే అన్ని అంశాలూ ఉన్నాయని, అందరికీ భలేగా నచ్చేస్తుందన్నారు. గతంలో వెంకీ కుడుముల దర్శకత్వంలో తాను నటించిన భీష్మ చిత్రం మంచి విజయాన్ని సాధించిందని, ఆ సినిమాలో ఒక సన్నివేశం ఈ రాజమండ్రిలోనే చిత్రీకరించామని, దాంతో సినిమా హిట్టని, అదే సెంటిమెంట్‌తో రాబిన్‌హుడ్ సినిమాలో కూడా ఒక సీన్ ఇక్కడ చిత్రీకరించామని, సినిమా తప్పకుండా సూపర్ హిట్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ ఇప్పటికే రాబిన్‌హుడ్ టీజర్ సాంగ్స్‌కు మంచి స్పందన వస్తోందని, సినిమా తప్పకుండా హిట్ అవుతుందన్నారు.

గోవిందా..గోవిందా..

- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.52.39 లక్షలు



స్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



ఆత్రేయపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి పండితులు ఐశ్వర్య లక్ష్మీ హోమం, బాలభోగం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో నిలుచుని స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఓ భక్తురాలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను దేవస్థానానికి అందించడంతో తిరిగి ఆమెకు అందించారు. రాత్రి పశ్చిమ గోదావరి తణుకు శృతిలయ అకాడమీకి చెందిన కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.52.39 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

డెల్టా కాలువలకు పెరిగిన నీటి విడుదల



ధవళేశ్వరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. ఇప్పటి వరకు మూడు డెల్టా కాలువలకు 9850 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా శనివారం నుంచి 10,250క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టాకు 3050 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2050 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5200 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.25 అడుగులుగా నమోదు కాగా పాండ్ లెవెల్ 13.79గా ఉంది.

వైభవంగా నరసన్న శ్రీ పుష్పయాగం



కోరుకొండ నరసింహస్వామి ఆలయ ముఖ మండపంలో శ్రీపుష్పయాగం

కోరుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో ఏడో రోజైన శనివారం రాత్రి స్వామికి శయనంద పర్యోత్సవం(శ్రీ పుష్పయాగం) వైభవంగా నిర్వహించారు. ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో స్వామికి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం జరిపి అనంతరం పల్లకీలో ఆశీనులను చేసి ఆలయం చుట్టూ నృత్య, సంగీత వాయిద్య వంటి 12 రకాల ధ్వనులతో 12 ప్రదక్షిణలు నిర్వహించారు. తదుపరి స్వామికి 12రకాల ఆరాధనలు, 12రకాల నివేదనలు సమర్పించి శ్రీపుష్పయాగాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పరాశర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదాయం రూ.23,25,537

నరసింహస్వామి హుండీలను అన్నవరం దేవస్థానం అధికారులు, సిబ్బంది దేవస్థానం కల్యాణ మండపం వద్ద శనివారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.12,41,365 ఆదాయం వచ్చిందని అధికారులు డీటీ చంద్రశేఖర్, వాసు, రాంజీ తెలిపారు. అలాగే స్వామి వారి కల్యాణం ద్వారా రూ.2,10,924, దర్శనాల ద్వారా రూ.2,37,530, లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.4,06,700, లైసెన్సుల ద్వారా రూ.1,88,400, కట్నాలు రూ.40,618.... వెరసి రూ.23,25,537 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం అధికారులు చెప్పారు.





కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు



అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

అధికారుల తీరు మారదా?

● ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధుల నిలదీత

● జిల్లా ఉన్నతాధికారుల గైర్హాజరు.. కాకినాడ కలెక్టర్ మాత్రమే హాజరు

● స్వచ్ఛ కార్యక్రమం కారణంగా హాజరుకాలేకపోయారని వివరణ

● సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అధికారులు ఉక్కిరిబిక్కిరి

● రూ.1014 కోట్లతో జడ్పీ బడ్జెట్ ఆమోదం



కాకినాడలో జరిగిన జడ్పీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీలు, అధికారులు

కాకినాడ/కాకినాడ సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అది నాలుగు జిల్లాలకు సంబంధించిన కీల క సమావేశం. అయినా అందులో రెండు జిల్లాల ఉన్నతాధికారులు హాజరుకాని వైనం.. ఇదే తీరు గత మూడు సమావేశాల నుంచి జరుగుతుండ డంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సమావేశంలో ఎక్స్‌అఫీషియో సభ్యులు భగ్గుమన్నారు. ఆయా జిల్లాల అధికారులే లేక పోవడంతో జడ్పీ సమావేశం ఏ హడావుడి లేకుండా సాదాసీదాగా సాగింది. రూ.1014 కోట్లతో జడ్పీ బడ్జెట్‌ను సభ్యులంతా కలిసి ఆమోదించారు. కాకినాడలోని జడ్పీ సమావేశమందిరంలో తూర్పుగోదావరి జిల్లా పరిషత్ బడ్జెట్, సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తప్ప ఆ స్థాయి కేడర్‌గల అధికారులు మిగిలిన జిల్లాల నుంచి హాజరుకాలేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో ఉన్నత స్థాయి అధికారులెవరూ హాజరుకాలేదు. దీంతో సమావేశానికి హాజరైన ఎక్స్‌అఫీషియో సభ్యుల్లో ఒకరైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తీవ్రంగా మండిపడ్డారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరరావు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, కుడుపూడి సూర్యనారాయణ ప్రజా సమస్యలపై అధికారులను నిలదీశారు. దీనికి కాకి నాడ జిల్లా కలెక్టర్ కలుగజేసుకుని సర్దిచెప్పే ప్ర యత్నం చేశారు. తర్వాత సమావేశానికి అందరూ హాజరయ్యేలా సమన్వయం చేసుకుంటామన్నారు. 'స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివస్' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు బిజీ షెడ్యూల్ ఉండడంతో రాలేకపోయారని వివరణ ఇచ్చారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు చెల్లించలేదని విద్యార్థుల హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారని, దీనిపై సీరియస్‌గాస్పందించాలని కలెక్టర్‌ను కోరారు.

రెండో పంటకు నీటి విడుదలపై..

ఉమ్మడి జిల్లాలో రెండో పంటకు నీటిని విడుదల చేసే అంశాన్ని సమావేశంలో పలువురు జడ్పీటీసీలు లేవనెత్తగా ఇరిగేషన్ అధికారులు వివరణ ఇచ్చారు. శివారు ప్రాంత పొలాలకు నీటిని సరఫరా చేయాలని రాజోలు జడ్పీటీసీ మట్టా శైలజ కోరారు. రేషన్ బియ్యం నాసిరకం గా ఉంటున్నాయని చెప్పడంతో.. దానిపైనా విచారణ జరపాలని ఎమ్మెల్యే వేగుళ్ల, మరో జడ్పీటీసీ కలెక్టర్‌ను కోరారు. దీనిపై కాకినాడ కలెక్టర్ వివరణ ఇస్తూ కొత్త పంట కావడంతో అన్నం ముద్దగా అవుతుందని, బియ్యంలో పోషకాలు కలిపాకే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందజేస్తామని బదులిచ్చారు.

జనరిక్ మందులపై అవగాహన కల్పించాలి

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమాలను జిల్లాల్లో విస్తృతంగా నిర్వహించాలని, ఆరోగ్యంపై వ్యయాన్ని తగ్గించేందుకు ఏర్పాటుచేసిన జనరిక్ మందుల షాపులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ కోరారు. కారుణ్య నియామకాలను వేగవంతం చేయాలని, ఉద్యోగులకు జీపీఎఫ్ స్లిప్పులు జారీ చేయాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు కోరారు. గిరిజన ప్రాంత ప్రజా సమస్యలపై చర్చ, పరిష్కారానికి ఐటీడీఏ జనరల్ బాడీ సమావేశాలకు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఎమ్మెల్సీ అనంతర ఉదయ్ భాస్కర్‌తో పాటు, ఏఎస్ఆర్ జిల్లా పరిధి జడ్పీటీసీలు కోరగా.. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం స్పందిస్తూ ఏప్రిల్ చివరి లేదా మే తొలివారంలో తదుపరి సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. తమ జిల్లాలకు సంబంధించి సభ్యులు లేవనెత్తిన అంశాలపై చర్యలు చేపడతామని తూర్పుగోదావరి జిల్లా జేసీ ఎస్.చినరాముడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్వో రాజకుమారి సభ్యులకు తెలిపారు. బడ్జెట్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన సభ్యులు, అధికారులకు జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్లు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలత, జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్, ఏవో ఎం.బుజ్జిబాబు పాల్గొన్నారు.

నీరు దారి మళ్లిస్తే కేసులు : కలెక్టర్ సీరియస్



పంటపొలాలకు నీళ్లు ఇచ్చే విషయమై తాళ్లరేవు జడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ మాట్లాడారు. దిగువనన పంటలకు సకాలంలో నీరు వదలడంలేదని అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై కాకినాడ కలెక్టర్ స్పందిస్తూ ఇరిగేషన్ కాలువలకు ఎగువనున్న కొందరు రైతులు, దిగువనున్న పొలాలకు నీళ్ల రానివ్వకుండా అడ్డుకట్టలు వేయడం సరైన విధానం కాదని మండిపడ్డారు. చదువుకున్న వాళ్లయ్యి ఉండి.. కనీసం ఇంకిత జ్ఞానం లేకుండా కొందరు ప్రవర్తిస్తున్నారు. వంతులవారీగా నీళ్లు ఇస్తున్నా కొందరు మోటార్లు పెట్టి లాగేస్తున్నారని, అందులో డాక్టర్లు, ఇంజినీర్లు వంటి వారు కూడా ఉన్నారని, ఆఖరికి ఇంజినీరింగ్ ఏఈని కూడా కాజులూరులో బెదిరించారని, ఈసారి ఎవరైనా అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు పెడతామని కలెక్టర్ తీవ్రంగా హెచ్చరించారు.

బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా...

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.70 లక్షల మిగులుతో రూ.1014కోట్ల బడ్జెట్‌ను ఉమ్మడి తూ ర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ ఆమోదించింది. జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. సమావేశంలో 2024-25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌ను, 2025-26 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను చర్చించి ఆ మోదించారు. 2024-25 సవరణ బడ్జెట్లో ఆదాయం రూ.846.60కోట్లు, వ్యయం రూ.845.95 కోట్లుగా చూపుతూ.. రూ.65 లక్షల మిగులుతో రివైజ్డ్ బడ్జెట్‌ను ఆమోదించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి అన్ని పద్దులు కలిపి మొత్తం ఆదాయం రూ.1013.80కోట్లు కాగా, అన్ని పద్దుల కింద వ్యయం రూ.1013.10కోట్లు కాగా.. రూ.70 లక్షలు మిగులుగా చూపారు. ఆదాయంలో జడ్పీ సాధారణ నిధులు రూ.28కోట్లు, ప్రభుత్వం నుంచి కేటాయించే శాలరీ గ్రాంట్లు రూ.10.48 కోట్లు, నిర్దిష్ట గ్రాంట్లు రూ.46.09 కోట్లు, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా, ఇతరశాఖల ద్వారా వచ్చే గ్రాంట్లు రూ.922.39 కోట్లుగా ఉన్నాయి. జడ్పీ సాధారణ నిధుల నుంచి షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి 15శాతం రూ.2.97కోట్లు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి ఆరుశాతం కేటాయింపు రూ.1.19 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి 15శాతం కేటాయింపు రూ.2.97 కోట్లు, అభివృద్ధి పనులకు 23 శాతం నిధులు కేటాయిస్తూ బడ్జెట్‌నుసమావేశం ఆమోదించింది.

నిబంధనలు ఏం చెబుతున్నాయి: ఎమ్మెల్యే వేగుళ్ల



ఉపాధి హామీ పథకం నిధుల వినియోగంలో నిబంధనలు ఏం చెబుతున్నాయని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రశ్నించారు. తక్కువ ఖర్చు చేసిన జిల్లాల నుంచి నిధులను వేరే జిల్లాలకు బదలాయించుకోవచ్చా అని ప్రశ్ని ంచారు. తనకు తెలిసి ఉండగా ఎన్ఆర్ఈజీఎస్‌లో అలాంటి నిబంధనలేవీ లేవని, ఏ జిల్లాకు కేటాయించిన నిధులు ఆ జిల్లాలోనే ఖర్చు చేయాలని, పక్క జిల్లా నుంచి నిధులు తెచ్చే ప్ర యత్నం చేస్తున్నామని ఏ విధంగా చెబుతున్నారని కాకినాడ జిల్లా కలెక్టర్‌ను ఉక్కిరిబిక్కిరి చేశారు. దీంతో కాస్త తడబడిన కలెక్టర్ తనకు దీనిపై పూర్తి అవగాహన లేదని, నిబంధనలు నిశితంగా పరిశీలిస్తానని వివరణ ఇచ్చారు.

హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ ఇబ్బందులు: ఎమ్మెల్సీ ఇళ్ల

విద్యార్థుల హాల్ టికెట్లు వాట్సాప్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం విద్యాశాఖ కల్పించినా ఫీజులు చెల్లించలేదని యాజమాన్యాలు ఏ విధంగా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తాయని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. దీనిపై కాకినాడ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నర్సింగ్ కళాశాల పరీక్షల హాల్ టికెట్లు మాత్ర మే వాట్సాప్‌లో రాని పరిస్థితి ఉంది.. వాటిపై దృష్టిపెడతామని స్పష్టం చేశారు.



జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు వెళ్లి వస్తూ..

గుండెపోటుతో జనసైనికుడి మృతి

పార్టీ అధినేత పవన్ సంతాపం



పవన్ ఆదేశాలతో దుర్గాప్రసాద్ తల్లి పార్వతికి రూ.2 లక్షలు నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అమలాపురం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు వెళ్లి తిరిగి వస్తుండగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి గ్రామానికి చెందిన జనసైనికుడు అడపా దుర్గాప్రసాద్ (42) అలియాస్ చిన్నా గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందాడు. శనివారం సమాచారం తెలుసుకున్న జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మృతుని కుటుంబానికి సంతాపం ప్రకటించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు ఏర్పాటు చేసిన బస్సులో గ్రామం నుంచి దుర్గాప్రసాద్ వెళ్లాడు. అనంతరం రాత్రి చిత్రాడ నుంచి బస్సులో సహచరులతో కలిసి బయలుదేరారు. బస్సులో గుండెపోటుతో మరణించాడు. తెల్లవారుజామున దుర్గాప్రసాద్ మృతదేహాన్ని స్వగ్రామమైన ఈదరపల్లి గ్రామానికి తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న జనసైనికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు. మృతుడికి తల్లి పార్వతితో పాటు సోదరుడున్నారు. తల్లి గత కొంతకాలంగా అనారోగ్యంతో మంచాన ఉంది.

దుర్గాప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలి : పవన్‌కల్యాణ్

జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు వచ్చి తిరిగి వెళ్తుండగా దుర్గాప్రసాద్ హఠాన్మరణం చెందారని తెలిసి చింతిస్తున్నానని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంతాప సందేశాన్ని విడుదల చేశారు. దుర్గాప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ఆ కుటుంబానికి పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని ప్రకటించారు. జనసేన శాసనమండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్ సూచనల మేరకు అమలాపురం నియోజకవర్గ జనసేన నాయకులు సీనియర్ నేత నల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్ ఇంటికి చేరుకున్నారు. ఆ కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.50వేలు అందించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, నాయకులు దుర్గాప్రసాద్ ఇంటికి చేరుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ రూ2.లక్షలు ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందించగా ఆ మొత్తాన్ని వారు అందజేశారు.

పోతవరంలో పవర్ లిఫ్టింగ్ పోటీలు

పది కేటగిరీల్లో 30 మంది విజేతలు, చాంపియన్ ఆఫ్ చాంపియన్

పాల్గొన్న అల్లూరి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల క్రీడాకారులు





పోతవరంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



విజేతలకు బహుమతి, ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

పి.గన్నవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ ఫిట్నెస్ జోన్ ఐదవ వార్షికోత్సవం పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోతవరంలో యునైటెట్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ అండ్ బెంజ్ ప్రెస్-2025 పోటీలు జరిగాయి. కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అండ్ ఎస్ఎస్ ఫిట్నెస్ జోన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన పోటీలను శనివారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వ్యాయమం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యవంతంగా జీవించవచ్చన్నారు. పోటీలకు ఆధ్వర్యం వహించిన ఎస్ఎస్ ఫిట్నెస్ జోన్ నిర్వహకులు కత్తుల శ్రీనివాస్‌ను అభినందించారు. ఈవెంట్ ఆర్గనైజర్ కత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొనున్నట్టు వివరించారు. 3 విభాగాల్లో (మహిళలు, మాస్టర్స్, బాయ్స్) మొత్తం 10 కేటగిరిలకు సంబంధించి మెన్ 53, 59, 66, 74, 83, 93 కిలోల మాస్టర్స్, బాయ్స్ విభాగాలు పాల్గొనగా, 63 కిలోల లోపు, ఆపైన కిలోల విభాగాల్లో మహిళలు పాల్గొన్నారు. మొత్తం 3 కేటగిరిలకు సంబంధించి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలకుగాను 30మందికి విజేతలతో పాటు చాంపియన్ ఆఫ్ చాంపీయన్ విన్నర్‌కు ట్రోఫీ, నగదు పురస్కారాలు, మెరిట్ సర్టిఫికెట్, మెడల్, నేషనల్ షీల్డ్‌లను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, కోనసీమ జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యనుమల వెంకట పద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్ననాయుడు, సంసాని పెద్దిరాజు, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, దైవాల రాంబాబు, యన్నాబత్తుల ఆనంద్, చికిలే తరుణ్, తోలేటి వంశీకృష్ణ, బొరుసు రాజబాబు, నందుల సన్నీ, తోలేటి రాజా, జిమ్ సభ్యులు పాల్గొన్నారు.

పుష్కరాలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలి

రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి



తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో చర్చిస్తున్న ఎంపీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలను అత్యంత సమర్థవంతగా నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటి వినియోగం-దుర్గంధంలేని టాయిలెట్స్ ఏర్పాటుపై రోసారి ప్రొఫెషనల్ టీంతో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహకిషోర్, కమిషనర్ కేతన్ గార్గ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేసర్స్ రోసారి ప్రొఫెషనల్‌తో వాటర్ లెస్ ఒడోర్‌లెస్ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హేమంత్, సత్యనారాయణ వివరించారు. పురందేశ్వరి మాట్లాడుతూ ప్రధాని మోదీ స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆవాస్ కార్యక్రమం కింద విజన్-2047 దిశగా అడుగులు వేస్తు న్నట్టు చెప్పారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా టాయిలెట్స్ ఏర్పాటు చేసే క్రమంలో ప్రకృతి వనరులను సంరక్షించే దిశగా తక్కువ నీటి వినియోగం వాసనలేని టాయిలెట్స్ ఏర్పాటు చేసే ప్రాజెక్ట్ ఆలోచన రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఇందుకోసం కంపెనీ ప్రతినిధులతో ప్రాజెక్టుపై సమగ్రంగా చర్చించినట్టు తెలిపారు. ప్రకృతి వనరుల సంరక్షణ వాసనలేని నీరులేని మూత్ర విసర్జన్ పరికరం పరిశుభ్రతను పెంచడమే కాకుండా నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు స్థిరమైన పారిశుధ్య నిర్వహణసామర్థ్యం పెంచడం ఈ ప్రాజెక్ట్‌లో ప్రధాన అంశమని కమిషనర్ వివరించారు.

సత్యదేవుని సన్నిధిలో భక్తుల రద్దీ

3 వేల వ్రతాలు, రూ.40 లక్షల ఆదాయం



స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అన్నవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం వివాహ ముహూర్తాలు ఉండడంతో అన్న వరం కొండపై, ఇతర ప్రాంతాల్లో ఒక్కటైన జం టలు, ఆయా పెండ్లిబృందాలతో రద్దీ ఏర్పడింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో సుబ్బారావు ఆదేశాలతో అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక దర్శనానికి గంట సమయం, ఉచిత దర్శనానికి 2గంటల సమయం భక్తులు వేచిఉన్నారు. శనివారం ఒక్కరోజు సుమారు 3 వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.40లక్షల ఆదాయం లభించింది. సత్యదేవునికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పూజలు



అంతర్వేదిలో శ్రవణ్‌కుమార్‌కు చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

అంతర్వేది, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి శనివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ ఎన్వీ.శ్రవణ్‌కుమార్ విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ సూపరింటెండెంట్ వి.విజయసారథి అందింజేశారు.

జీజీహెచ్‌లో ముగ్గురు జీబీఎస్ బాధితులకు చికిత్స

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) బారిన పడిన ముగ్గురు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి శనివారం తెలిపారు. వారిలో ఇద్దరు జీబీఎస్‌తో బాధపడుతుండగా మరో వ్యక్తిలో అనుమానాస్పద లక్షణాలు కనిపించడంతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జీబీఎస్ కేసులకు సంబంధించి జీజీహెచ్‌లో చికిత్స, మందులు, వ్యాక్సిన్, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

తాడేపల్లిగూడెం రోడ్డు ప్రమాద మృతులకు

మండపేటలో అంత్యక్రియలు

మండపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. మృతదేహాలకు పోస్టుమార్టం మండపేటకు తీసుకురావడంతో శుక్రవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలను నిర్వహించారు.

చంద్రకిషోర్, కుమారుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

సర్పవరం జంక్షన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ 2వ డివిజన్ తోట సుబ్బారావు నగర్ రోడ్డు నెంబర్-2, రామానాయపేట భూదేవి అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న వానపల్లి చంద్రకిషోర్ (37) తన పిల్లలను చంపి తాను కూడా శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. కాకినాడ జీజీహెచ్‌లో ఇద్దరు చిన్నారులు, చంద్రకిషోర్ మృతదేహాలకు వైద్యులు శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబసభ్యులకు మృతదేహాలను అప్పగించారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాడేపల్లిగూడెంకు చేరిన మృతదేహాలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో తన ఇద్దరు కుమారులను చంపి తాను ఆత్మహత్య చేసుకున్న వానపల్లి చంద్రకిషోర్, పిల్లలు జోషిల్, నిఖిల్ మృతదేహాలు శనివారం రాత్రికి తాడేపల్లిగూడెంలోని చంద్రకిషోర్ తండ్రి సూరిబాబు నివాసానికి చేరాయి. తాను చనిపోవడమే కాకుండా తన ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారులను చంపాడనే వార్తతో తాడేపల్లిగూడెం పాతూరులో విషాదఛాయలు అలముకున్నాయి.



అంబులెన్స్‌లో చంద్రకిషోర్, జోషిల్, నిఖిల్ మృతదేహాలు

గందరగోళంగా పోలవరం సభ

చింతూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం సభ మరోమారు అసంపూర్తి, భిన్నాభిప్రాయాలతో పాటు గందరగోళం నడుమ ముగిసింది. చింతూరులో శనివారం పోలవరం నిర్వాసితుల పునరావాస స్థల నిర్ధారణ సభ జరిగింది. కొద్దిరోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో వెలువడిన పీడీఎఫ్ (నిర్వాసితుల లిస్ట్) నేపథ్యంలో నిర్వహించిన ఈ సభను ఆర్ అండ్ ఆర్‌లో ఒక భాగమైన కరువ భత్యపు సభగా నిర్వాసితులు భావించారు. ఆ పీడీఎఫ్‌లో పలువురి పేర్లు కన్పించకపోవడంతో సభలో కొద్ది నిమిషాలపాటు గందరగోళం ఏర్పడింది. సామాజిక మాధ్యమాల్లో వెలువడిన పీడీఎఫ్ అనధికారమని పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.చంద్రశేఖర్, నాగమణి స్పష్టం చేయడంతో గందరగోళం సద్దుమణిగింది. కాగా డివిజన్ కేంద్రమైన నిర్వాసిత గిరిజన కుటుంబాలకు ఎటపాక మండలంలో కాలనీలు, సాగుభూమి సమకూర్చనున్నట్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తెలిపారు. స్పందించిన గిరిజన నిర్వాసితులు తమకు ఎటపాక మండలంలో భూములు వద్దని, చింతూరు మండలంలో ముంపునకు గురికాని గ్రామాలైన లక్కవరం, తులసిపాకలలో భూమికి భూమి, కాలనీలు కేటాయించాల్సిందిగా కోరారు. గిరిజనేతర నిర్వాసితులకు పశ్చిమగోదావరి జిల్లాలోని తాడువాయి, యాదవోలు గ్రామాల్లో కాలనీలు నిర్మించే విషయంలో నిర్వాసితులు తమ నిర్ణయం ప్రకటించాల్సిందిగా ఎస్‌డీసీలు కోరారు. గిరిజనేతరులు కూడా తమకు తాడ్వాయి, యాదవోలు గ్రామాలు వద్దని, ఆయా గ్రామాల మీదుగా గ్యాస్ పైప్ లైన్ వెళుతుండడంతో పాటు సురక్షితమైన తాగునీరు కూడా లభ్యమయ్యే పరిస్థితి లేదని నిర్వాసితులు విముఖత వ్యక్తం చేశారు. అదే దశలో తమకు తూర్పుగోదావరి జిల్లా గోకవరం సమీపంలోని కృష్ణునిపాలెంలో కాలనీలు ఏర్పాటు చేయించాల్సిందిగా కోరారు. దీంతో గిరిజన, గిరిజనేతర నిర్వాసితుల అభిప్రాయాలను అధికారులు నోట్ చేసుకున్నారు. నిర్వాసితుల నిర్ణయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాగా పరిహారం పెంపు, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు చేయాలన్న పలుడిమాండ్లు నిర్వాసితుల నుంచి వచ్చాయి.

సికింద్రాబాద్‌కు రాకుండా

మరో 9 రైళ్ల దారి మళ్లింపు

స్టేషన్ పునరాభివృద్ధి పనుల నిమిత్తం నిర్ణయం

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనుల నిమిత్తం మరో 9 రైళ్లను దారి మళ్లిస్తున్నట్టు శనివారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. వీటిలో 4 ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, అమ్ముగూడ, లింగంపల్లి మీదుగా మరో 5 ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, మౌలాలి బైపాస్ మీదుగా కామారెడ్డి వైపు మళ్లించాలని నిర్ణయించి నట్టుసీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ఏప్రిల్ 22 నుంచి విశాఖపట్నం-ముంబై-విశాఖపట్నం (20809/20810), మచిలీపట్నం-షిర్డీ-మచిలీపట్నం వీక్లీ (17207/17208), ఏప్రిల్ 23 నుంచి కాకినాడ-షిర్డీ-కాకినాడ ట్రై వీక్లీ (17205/17206), మే 9 నుంచి వాస్కోడగామా-జసిదిడ్-వాస్కోడగామా వీక్లీ (17321/17322) ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, అమ్ముగూడ, సనత్‌నగర్, లింగంపల్లి మీదుగా మళ్లించనున్నట్టు చెప్పారు. అలాగే ఏప్రిల్ 24 నుంచి విశాఖపట్నం-సాయినగర్ షిర్డీ- విశాఖపట్నం వీక్లీ (18503/18504), ఏప్రిల్ 25 నుంచి నర్సాపూర్-నాగర్‌సోల్-నర్సాపూర్ (12787/12788), సంబల్‌పూర్-నాందేడ్ ట్రైవీక్లీ (20809/20810), ఏప్రిల్ 26 నుంచి విశాఖపట్నం-నాందేడ్- విశాఖపట్నం ట్రైవీక్లీ (20811/20812), ఏప్రిల్ 28 నుంచి నర్సాపూర్-నాగర్‌సోల్-నర్సాపూర్ బై వీక్లీ (17231/17232) ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, మౌలాలి బైపాస్ మీదుగా కామారెడ్డి వైపుమళ్లించనున్నట్టు శ్రీధర్ తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రేపు పండూరులో ప్రత్యేక గ్రీవెన్స్

సర్పవరం జంక్షన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం పండూరులో సోమవారం మండల స్థాయి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పండూరులో నిర్వహించిన రచ్చబండలో పలు ఫిర్యాదులు వచ్చాయి. వాటి స్వీకరణ కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఉత్తర్వులిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి పండూరు గ్రామ సచివాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు.



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న నాగబాబు, జనసేన నేతలు

సమాజంలో చెడు, కుళ్లును క్లీన్ చేస్తున్నారు

పారిశుధ్య కార్మికులను సన్మానించిన జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు

పిఠాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 'పారిశుధ్య కార్మికులపై మాకు అపారమైన గౌరవం ఉంది. సమాజంలో చెడు, కుళ్లని క్లీన్ చేసే వృత్తిలో మీరు ఉన్నారు. అది చిన్న విషయం కాదు. మీరు లేకున్నా, ఒకట్రెండు రెండు రోజులు సమ్మె చేసినా ఎవరూ ఇళ్లల్లో ఉండలేరు. వీధుల్లో నడవలేరు. అటువంటి మిమ్మల్ని సత్కరించుకోవడం పార్టీకి, మాకు ఎంతో గర్వకారణంగా ఉంది' అని జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అన్నారు. కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో శనివారం సాయంత్రం ఆయన పారిశుధ్య కార్మికులను సత్కరించి నగదు పురస్కారాలు అందజేశారు. మీరు సమాజానికి గొప్పగా సేవ చేస్తున్నారంటూ అభినందించారు. అన్ని రకాల దుర్గంధాలను పారదోలి సమాజానికి గొప్ప సేవ చేస్తున్న మీకు అన్ని వేళలా అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, కుడా చైర్మన్ తుమ్మల బాబు, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆవిర్భావ సభ సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు, పిఠాపురం మునిసిపల్ కమిషనరు నామా కనకారావు, జనసేన నాయకుడు కదారి తమ్మయ్యనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తున్న 'భాష్యం'

బ్లూమ్స్ కల్చరల్ డేలో వక్తలు

కాకినాడ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కాకినాడ జేఎన్టీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కేవీఎస్ మురళీకృష్ణ కోరారు. శనివారం కాకినాడ భాష్యం బ్లూమ్స్‌లో హుష్లా పేరిట జరిగిన కల్చరల్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యా విధానంతో విద్యార్థుల్ని విజయవంతులుగా తీర్చిదిద్దుతున్న భాష్యం బ్లూమ్స్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. మరో అతిథి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను బోధిస్తూ వారిపై ఎలాంటి ఒత్తిడి లేకుండా చర్యలు తీసుకుంటున్న భాష్యం బ్లూమ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. మరో అతిథి, భాష్యం పూర్వ విద్యార్థి డాక్టర్ బ్రహ్మ జానారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సరైన ప్రణాళికతో విద్యనభ్యసిస్తే గొప్ప విజయాలు సొంతం అవుతాయన్నారు. తొలుత జ్యోతిప్రజ్వలనతో అతిథులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, జోనల్ ఇన్‌చార్జి వి.గోవిందరాజు, ప్రిన్సిపాల్ ప్రవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కేవీఎస్ మురళీకృష్ణ

భీమేశ్వరాలయంలో ఎస్పీ దంపతుల పూజలు

సామర్లకోట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ బిందుమాధవ్ కుటుంబ సమేతంగా శనివారం సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయానికి విచ్చేశారు. వారికి ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు) సాదర స్వాగతం పలికారు. తొలుత ఆలయ ఆవరణ లోని అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించిన ఎస్పీ దంపతులు భీమేశ్వరస్వామికి, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నంది మండపంలో వారికి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను ఈవో నీలకంఠం అందజేశారు. పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, సీఐ కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, ఎస్‌బీ హెచ్‌సీ జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



భీమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎస్పీ బిందుమాధవ్ దంపతులు

దేశ వనరులు అందరికీ అందుబాటులోకి రావాలి: జేసీ

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దేశ వనరులు సామాజికపరంగా, ఆర్థికపరంగా అందరికీ అందుబాటులోకి వచ్చి పేద వర్గాలు సైతం సుస్థిర జీవన ప్రమాణాలు అందుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆకాంక్షించారు. వినియోగదారుడే ఆర్థిక ప్రగతికి సూత్రధారుడు కాబట్టి వినియోగదారుల ఉద్యమం మరింత పటిష్ఠం కావాలన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన పౌరసరఫరాలు, లీగల్‌మెట్రాలజీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడ వినియోగదారుల ఉద్యమం ప్రథమ స్థానంలో ఉండడానికి వర్క్ షాప్స్, సెమినార్ల ద్వారా తమ వంతు కృషి చేస్తున్నాయన్నారు. కేసులను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మండల వినియోగదారుల సంఘాల ద్వారా చైతన్య సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య చైర్మన్ గిరిజారమాదేవి, మెంబర్ సుశి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సత్యనారాయణరాజు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్, సలహాదారు శివమూర్తి, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.



జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావుతో పొలిటికల్ సైన్స్ విద్యార్థులు

జడ్పీ సమావేశం నిర్వహణపై అధ్యయనం

సర్పవరం జంక్షన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన జడ్పీ సమావేశంలో కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ పొలిటికల్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు. సమావేశం నిర్వహణ, సభ్యుల పనితీరు, అజెండాలోని విషయాలపై చర్చ, అధికారుల సమాధానాలు, సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వారు అధ్యయనం చేశారు. పీజీ విద్యార్థులను కలెక్టర్ షాన్‌మోహన్, జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు అభినందించారు. క్షేత్రస్థాయి సందర్శన, పర్యటనలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ పేర్కొన్నారు. కార్యక్రమంలో కోర్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.జోసఫ్ స్టీఫెన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ హరిబాబు, డాక్టర్ ఎం.గోపి తదిరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప,



కాకినాడ జీజీహెచ్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ

స్వచ్ఛత, పచ్చదనంతో ఆరోగ్యవంతమైన సమాజం

సామర్లకోట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు స్వచ్ఛదనం, పచ్చదనంతో ఉంటే ఆరోగ్యవంతమైన సమాజానికి దోహదపడిన వారమవుతామని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కమిషనరు శ్రీవిద్య ఆధ్వర్యంలో నెం.2మార్కెట్ ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణానికి ఎంతో హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలన్నారు. మెప్మా సౌజన్యంతో గుడ్డ సంచులను వ్యాపారులకు అందజేశారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కుమారరామ భీమేశ్వరాలయంలో ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం నిర్వహించారు. సూపరింటెండెంట్ ఈశ్వరరావు, భారతీయ పురావస్తు శాఖ సిబ్బంది సురేష్, బాబు, శ్రీను, గుర్రాజు, వీరబాబు ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారాలను తొలగించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం, పచ్చదనం అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలు నాటి కాలుష్య నివారణకు కృషిచేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబు రాజు, మహారాణి సత్రం మాజీ చైర్మన్ తూతిక రాజు, మున్సిపల్ కమిషనరు కేవీ పద్మావతి, మేనేజరు జ్యోతిరాణి పాల్గొన్నారు.

కాకినాడ క్రైం (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యదాయకమైన సమాజాన్ని స్థాపించవచ్చని ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో వ్యర్థాలను శుభ్రపరిచి మొక్కలు నాటారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో (ఏఎస్పీ) మనీష్ దేవరాజ్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

జీజీహెచ్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛభారత్‌లో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయ ప్రాంగణాన్ని శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది శుభ్రపరిచారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేను క్రమం తప్పకుండా అమలు చేయడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్. పి.సరిత, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ ఐ.ప్రభాకర్, డీపీఎంవో డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఆధ్వర్యంలో ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. అన్ని విభాగాల్లోనూ వ్యర్థాలను తొలగించారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ పి.శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్ ఎన్. శ్రీధర్, ఆర్ఎంవో డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకే (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇండోర్ మైదానంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ వలంటీర్లతో కలిసి పరిసరాలను శుభ్రపరిచారు. ఒకసారి ఉపయోగించిన ప్లాస్టిక్‌ను 20 సంచుల్లో సేకరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని, భావితరాలకు కాలుష్యరహిత సమాజాన్ని అందించడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ పర్యావరణ ఇంజనీర్ ఎంబీఎస్ శంకరరావు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించండి థీమ్‌తో పలు పరిశ్రమల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. పరిశ్రమలు, సంస్థల సిబ్బంది ఆధ్వర్యంలో ఉదయం 6.30 నుంచి 9.30 గంటల వరకు రోడ్లపక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో 15 పరిశ్రమలకు చెందిన 945 మంది సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులు వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని కొత్తపల్లి ఈవోపీఆర్డీ సత్యారెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లో పలు హోటళ్లు, దుకాణాల వద్ద ప్లాసిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాల్లో క్లాప్‌మిత్రలు, గ్రామస్థులకు చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తలను క్లాప్‌మిత్రలకు అందచేయాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీల కార్యదర్శులు, శ్రీనివాస్, చాందిని, ఉమ పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్పీ బిందుమాధవ్



కాకినాడ రూరల్ వలసపాకలలో రోడ్డు పక్కన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యం

వైద్య సిబ్బంది, ఆశాల పనితీరు సరిగా లేదు

గొల్లప్రోలు మండల పరిషత్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

గొల్లప్రోలు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తల పనితీరు సరిగా లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాధానం చెప్పాల్సిన వైద్యాధికారులు ఒక్కరు కూడా హాజరుకాకపోవడంపై మండిపడ్డారు. గొల్లప్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అరిగెల అచ్చియమ్మ అధ్యక్షతన శనివారం జరిగింది. వైద్య, ఆరోగ్య శాఖ పనితీరును సభ్యులు ప్రస్తావించారు. ఆ సమయంలో వైద్యాధికారులెవరూ హాజరు కాలేదు. కొంత సమయానికి హెల్త్ సూపర్‌వైజరు రమణమూర్తి హాజరై... వైద్యుల్లో ఒకరు 104 సేవల్లో, మరొకరు ఓపీ చూస్తున్నారని తెలిపారు. దీనిపై ఎంపీడీవో కర్రి స్వప్న అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది సరికాదని కలెక్టర్, డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వైస్ ఎంపీపీ బత్తిన మంగ మాట్లాడుతూ గర్భిణులను డెలివరీకి తీసుకువెళ్లేందుకు ఏఎన్ఎంలు సహకరించట్లేద న్నారు. నెలనెలా ఆసుపత్రులు తీసుకువెళ్లాల్సిన ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండట్లేదన్నారు. ఆశాలకు రాజకీయ నాయకుల మద్దతు ఉండడంతో తాము చర్యలు తీసుకోలేకపోతున్నామన్న హెల్త్ సూపర్‌వైజర్ సమాధానంపై ఎంపీడీవో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆశా కార్యకర్తల పనితీరుపై సభ్యుల ఫిర్యాదులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని ఎంపీపీ సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణు స్పందిస్తూ గ్రామ పంచాయతీలు కొన్ని నిధులను తాగునీటి కోసం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని చర్యలూ తీసుకున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరు సరిగా లేదని వైస్ ఎంపీపీ మంగ చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఆదివిష్ణు, తహసీల్దారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసునామీని తలపించింది

జనసేన ఆవిర్భావ సభ విజయవంతమైంది: సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు



పిఠాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో నిర్వహించిన జనసేన ఆవిర్భావ సభ జన సునామీని తలపించిందని ఆ పార్టీ చోడవరం ఇన్‌చార్జి, ఆవిర్భావ సభ సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సభ విజయవంతంగా జరిగిందన్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని జనసేన నాయకులు, జన సైనికులు, వీర మహిళలు పది రోజులు కష్టపడి సభను జయప్రదం చేసేందుకు కృషి చేశారని తెలిపారు. పవన్ పట్ల అభిమానం చూపిన ప్రజలకు, సభ విజయవంతానికి కృషి చేసిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

విజయజనార్దనాచార్యులుకి 'అర్చకసేవ వైభవరత్న' అవార్డు



పిఠాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానం అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు 'అర్చకసేవ వైభవరత్న' అవార్డుకు ఎంపికయ్యారు. ఆలయ అభివృద్ధి, హిందూ ధార్మిక సేవ, సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేందుకు చేస్తున్న కార్యక్రమాలకు ఆయనకు హైదరాబాదులోని సర్ సీవీ రామన్ అకాడమీ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక అకాడమీ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈనెల 16వ తేదీ నుంచి జరిగే 33వ ఉగాది మహోత్సవాల్లో విజయజనార్దనాచార్యులుకు సువర్ణ ఘంటా కంకణం, గోల్డ్‌మెడల్ అందజేస్తారు.

యూపీహెచ్‌సీ సందర్శన

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామరావుపేటలో గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)ని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరు, నేషనల్ హెల్త్ మిషన్ కాకినాడ జిల్లా ప్రత్యేక అధికారి జి.వీర పాండ్యన్ శనివారం సందర్శించారు. ఇక్కడ అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య పథకాలు, ప్రాజెక్టుల నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ జె నరసింహనాయక్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఉన్నారు.

పన్ను చెల్లించని 50 కుళాయి కనెక్షన్లు కట్

200 మందికి లీగల్ నోటీసులు జారీ

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరానికి పన్ను చెల్లించడానికి ఇంకా కేవలం 16 రోజులు మాత్రమే మిగిలి ఉంది. దీంతో నగరపాలక సంస్థ పరిధిలో పన్ను చెల్లించని మొండి బకాయిదారులపై చర్యలను వేగవంతం చేసినట్టు కమిషనరు భావన తెలిపారు. శనివారం ఒక్కరోజే పన్ను చెల్లించని సుమారు 50మంది కుళాయిలు తొలగించారు. ఇప్పటికే నోటీసులు ఇచ్చినా స్పందించని 200 మందికి మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ద్వారా ప్రాసిక్యూషన్ కోసం లీగల్ నోటీసులు పంపించారు.

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడం చంద్రబాబుకే సాధ్యం

కాకినాడ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రాన్ని దేశంలోనే నిలపడం చంద్రబాబుకే సాధ్యమని 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. చంద్రబాబు 41 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తయిన సందర్భంగా పార్టీ శ్రేణులకు స్వీట్లు పంచారు.

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

పెద్దాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, డీసీపీసీ మెంబర్, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ బి.సూర్యనారాయణమూర్తి, తూనికలు-కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ వి.మోహన్‌తో కలిసి పెద్దాపురం రైతు బజారులో అమ్ముతున్న కూరగాయల నాణ్యతను వేయింగ్ మిషన్ డిస్‌ప్లే తనిఖీ చేసి సూచనలిచ్చారు. కూరగాయలను నిర్దేశించిన ధరలకు మాత్రమే అమ్మాలని, రైతు బజారును పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దాపురం వినియోగదారుల సంఘం సభ్యులు ఎం.భాస్కరరావు, కె.సుధాకర్, టి.సత్యనారాయణ, జీవీఆర్ చౌదరి, వి.శ్యామల, కె.లక్ష్మి పాల్గొన్నారు.



సర్వేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ

కాకినాడ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని బాలాత్రిపురసుందరి సమేత సర్వేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ హంపి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యులు, తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతిస్వామి సమక్షంలో శనివారం శాస్త్రోక్తంగా జరిగింది. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మేడిశెట్టి బుజ్జి, గెద్దం పూర్ణ, చింతా పేర్రాజు, మేడిశెట్టి చిన్ని, చొక్కా గిరి, పాలిక నాని, అంగాడి దుర్గారావు, పీర్ల రాంబాబు, బొద్దు శివాజీ, బూడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొల్లప్రోలు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండల గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ స్కీములో భాగంగా గ్రామాల్లో కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. చేబ్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల అన్ని ఫీడర్లలోని చేబ్రోలు, దుర్గాడ, ఎ.విజయనగరం, చెందుర్తి, మల్లవరం, కొడవలి, వన్నెపూడి, తాటిపర్తి గ్రామాల్లో ఆదివారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పిఠాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణ శివారు ఏడు కాలువల్లో నూతనంగా నిర్మించిన నూకాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగాయి. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.20వేలు విరాళం అందజేశారు. వర్మ వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కొత్తపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 821 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 41 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్టు ఎంఈవో బుర్రా వేణుగోపాల్ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈవో విజ్ఞప్తి చేశారు.

సామర్లకోట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంఈవో వై.శివరామకృష్ణయ్య తెలిపారు. 1,438 మంది రెగ్యులర్ విద్యార్థులు, 872 మంది ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు.

ప్రకటన

తిరుపతి గ్రామ పంచాయితీ 12-03-2025

కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతి గ్రామ పంచాయితీ నందు వెలసిన శ్రీ శృంగార వల్లభస్వామి వారి గుడి చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో పార్కింగ్ స్టాండు వేలంపాట మరియు దుకాణాల ఆశీలు హక్కుల కొరకు డివిజనల్ పంచాయితీ అధికారి-పెద్దాపురం వారి ఉత్తర్వులు యల్.పరి.నెం. 81/2022, A3, తేది. 30-06-2022, ఉత్తర్వులు ప్రకారం తేది 26-03-2025 తేదీ బుధవారం ఉదయం 11.00 గంటలకు తిరుపతి గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద EO PR &RD-పెద్దాపురం వారి సమక్షంలో **2025-26 నుండి 2027-28** ఆర్థిక సంవత్సరం వరకు మూడు సంవత్సరములకు నకు గాను వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గల అభ్యర్థులు సదరు వేలం పాటలో పాల్గొన వలసినదిగా కోరడమైనది. ఇతర వివరముల కొరకు ఆఫీసు పని వేళలలో గ్రామ పంచాయితీ కార్యాలయం నందు సంప్రదించగలరు.

	అంశము	నిర్ణయించిన ధరలు
అంశము-1	వాహనములు పార్కింగ్	ద్విచక్ర వాహనములకు 10/- రూపాయలు, త్రిచక్ర వాహనములకు 20/- రూపాయలు, నాలుగు చక్ర వాహనములకు 30/- రూపాయలు మాత్రమే
అంశము-2	దుకాణాల ఆశీలు	ఒక్కో దుకాణమునకు 50/- రూపాయలు మాత్రమే

కార్యదర్శి
గ్రామ పంచాయితీ, తిరుపతి, పెద్దాపురం మండలం.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

శంఖవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో 4 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే పది పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు ఎంఈవో ఎస్వీ.రమణ తెలిపారు. ఈ నెల 17 నుంచి 31వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. కత్తిపూడి ఉన్నత పాఠశాల, శంఖవరం ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, అన్నవరం దేవస్థానం పాఠశాలలో జరిగే పరీక్షలకు 573మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9:30 నుంచి 12:45 వరకూ జరుగుతాయని తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధన దిశగా కృషిచేయాలి

- సబ్ కలెక్టర్ కల్పశ్రీ


రంపచోడవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న సబ్ కలెక్టర్

రంపచోడవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రా కార్యక్రమాన్ని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ పర్యవేక్షణలో నిర్వహించారు. రాష్ట్రం పురోగమించడంలో అందరూ భాగస్వామ్యం కావాలని, ముఖ్యంగా గ్రామాలు సైతం స్వచ్ఛంగా ఉండాలని, స్వర్ణాంధ్ర సాధనదిశగా సమన్వయంతో ప్రజలందరూ మమేకం కావాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెంలో శనివారం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా మోతుగూడెం సచివాలయం నుంచి పిల్లలతో ర్యాలీగా మోతుగూడెం మార్కెట్ సెంటర్, పాఠశాల విద్యార్థులు, పౌరులచేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గణేష్ టెంపుల్ వరకు నినాదాలు చేశారు. గణేష్ టెంపుల్ నుంచి యాదవ్‌వీధి వరకు తడి, పొడి చెత్త వేసుకునే ప్లాస్టిక్ డస్ట్‌బిన్‌లు ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. మోతుగూడెం సర్పంచ్ ఆకేటి సీత, పంచాయతీ కార్యదర్శి జి.మోహన్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


డస్ట్‌బిన్లు అందజేస్తున్న సర్పంచ్, సెక్రటరీ, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది, ఆశావర్కర్లు

నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాలు పూర్తిచేయాలి


జడ్పీ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ జ్యోతి

రాజవొమ్మంగి, మార్చి 15(ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా పరిషత్‌లో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో రాజవొమ్మంగి జడ్పీటీసీ వి.జ్యోతి మాట్లాడారు. రాజవొమ్మంగి మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు లేక అద్దె భవనాల్లో సెంటర్లు నిర్వహిస్తున్నారన్నారు. పది సంవత్సరాల క్రితం కొన్ని గ్రామాలకు కేంద్రాలను మంజూరు చేయగా, చాలా చోట్ల పునాది దశలోనే ఉన్నాయన్నారు. కొన్ని చోట్ల గోడలు నిర్మించి వదిలేశారని, మరికొన్ని చోట్ల స్లాబులు స్థాయిలోనే ఆగిపోయాయన్నారు. ఆ పనులన్నీ పూర్తిచేయాలని, కొత్త భవనాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై రంపచోడవరం పీవో స్పందించి భవనాలన్నీ పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

పునరావాస స్థలాన్ని ఎంచుకోండి : పంచాయతీ ఈవో

కూనవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులు తమ నివాసం ఉండబోయే స్థలాన్ని ఎంచుకోవాలని కూనవరం మేజర్ పంచాయతీ ఈవో సురేష్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ పరిధిలోని నిర్వాసితులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. నిర్వాసితులు తాము ఎక్కడ నివసిస్తామో అట్టి గూడును ప్రభుత్వం కేటాయించిన స్థలా లను ఎంచుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలో సుమారు 450 మందికి పైగా నిర్వాసితులు పేర్లు గల్లంతయ్యాయని, అందరి పేర్లు వచ్చాకే తాము జాబితా తయారు చేస్తామని టీడీపీ నేత చెలకాని ఉమామహేశ్వరరావు తెలిపారు. మరికొందరు మాత్రం 300 కుటుంబాలు జాబితాతో తాము తాడువాయిలో నివాసముంటామని ఈ సందర్భంగా అధికారులకు జాబితాను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హేమంత్, వీఆర్వో పిట్ల వెంకన్న, ఎంపీటీసీ అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పాపం.. విలీన మండలాల జనసైనికులు

● పవన్ సభకు వెళ్లేందుకు ఇక్కట్లు

కూనవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జనసేన 12వ ఆవిర్భావ సభలో తమ నాయకుడు పవన్‌కల్యాణ్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా తిలకించాలని చూసిన విలీన మండలాల జనసైనికులకు నిరాశే మిగిలింది. పవన్ కల్యాణ్ మీటింగ్ సందర్భంగా విలీన మండలాల్లో ఒక్కో మండలానికి మూడు బస్సులు కేటాయిస్తామని అల్లూరి జిల్లా జనసేన నాయకులు ఇక్కడ కార్యకర్తలకు తెలిపారు. అయితే వారికి ఎటువంటి బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర నిరాశ చెందారు. గ్రామాల్లోని కార్యకర్తలంతా వెళ్లేందుకు సిద్ధమవ్వగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆగిపోయారు. మరికొంతమంది మాత్రం సొంత ఖర్చులతో పిఠాపురం వెళ్లినప్పటికీ అక్కడ వీరికి ఎటువంటి పాస్‌లు కేటాయించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా జరపాలి

వై.రామవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): యార్లగడ్డ ఆశ్రమ పాఠశాలలో ఈనెల 17 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ చిన్నిబాబు ఇన్విజిలేటర్లకు సూచించారు. ఈ పరీక్షా కేంద్రంలో 164 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ఇందులో యార్లగడ్డ ఆశ్రమ బాలికల పాఠశాల నుంచి 43, పనసలపాలెం ఆశ్రమ బాలుర పాఠశాల నుంచి 46, దాలిపాడు ఆశ్రమ పాఠశాల నుంచి 33, తోటకూర పాలెం కేజీబీవీ నుంచి 17, వై.రామవరం జడ్పీ స్కూల్ నుంచి 12, వెదురునగరం గిరిజన వికాస కేంద్రం నుంచి 13 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఆయన తెలిపారు. అలాగే మండలంలోని ఎగువ ప్రాంతంలోని డొంకరాయి పదో తరతగతి పరీక్షా కేంద్రంలో 66 మంది పరీక్ష రాయనున్నట్టు ఎంఈవో తాతబ్బాయిదొర తెలిపారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ

రాజవొమ్మంగి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు టీడీపీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. సర్పంచ్ గొల్లపూడి రమణి ఆధ్వర్యంలో 97మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సత్యనారాయణ, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాస్, మండల కార్యదర్శి మున్నప్ప కేశవ్, మోహనకుమార్, మధు, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం నిర్వాసితులను కాలనీలకు తరలించాలి'


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పాడేరు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. తన కార్యాలయం నుంచి పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి, చింతూరు ఐటీడీఏ పీవో, రోడ్లు, భవనాలు, పంచా యతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పునరావాస కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు తదతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు సకాలంలో పరిహారం, భూములకు ప్రత్యా మ్నాయ భూములు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, రైతులకు మెట్టు, పల్లపు భూముల్లో ఏది కావాలంటే ఆ భూములను గుర్తించి రైతులకు అందించాలని కోరారు. వీడియోకాన్ఫరెన్స్‌లో పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి వి.అభిషేక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సరళా వందనం, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం


ఈతలపాడు సమీపంలో పడిన వృక్షం

రంపచోడవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అరకువ్యాలీ జాతీయ రహదారిలోని ఈతలపాడు సమీపంలో శనివారం సాయంత్రం భారీ వృక్షం నేలకొరిగింది. అతి పురాతనమైన వృక్షం కావడంతో ప్రధాన రహదారికి అడ్డంగా పడింది. దాన్ని తొలగించే వరకూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. స్థానికులు, వాహదారుల సహాయంతో రవాణాకు అంతరాయం లేకుండా అధికారులు తొలగించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



ఏలేశ్వరంలో మండలం సిరిపురంలో స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో రౌతులపూడి మండలం ఎ.మల్లవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

ఏలేశ్వరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సమష్టిగా ప్లాస్టిక్ నివారణకు చర్యలు చేపడదామని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం సిరిపురం గ్రామంలో పంచాయతీ సిబ్బంది, శానిటేషన్ వర్కర్లు పిచ్చి మొక్కలను,చెత్తను తొలగించి తడి చెత్త పొడి చెత్తను వేరు చేశారు. అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. బీజేపీ నాయకులు రెడ్డి వరలక్ష్మీ, శీరం తలుపులమ్మ, డేగల నాగమణి, వంగలపూడి సత్యవేణి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రౌతులపూడి(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీడీపీ యువనేతలు పల్లికుమార్, గవిరెడ్డి గురునాథ్ అన్నారు. మల్లవరంలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నివారణపై ప్రజలు అవగాహన కల్పించారు.


తుని రూరల్: ఎస్ఎన్ వారంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చెత్తను రోడ్లపై వేయరాదు

ఎంపీడీవో చంద్రశేఖర్

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలందరూ వారి గృహాల్లో వినియోగించిన చెత్తను రోడ్లపై వేయరాదని జగ్గంపేట ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. శనివారం జగ్గంపేటలోని పలు వీధుల్లో గృహాలు, షాపుల వద్ద వినియోగించిన చెత్తను రోడ్లపై వెయ్యడంతో ఆ చెత్తను చెత్తవేసిన వారితోనే తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీవో మాట్లాడుతూ గృహాలు, షాపులలో వినియోగించిన చెత్తాచెదారాలను రోడ్లపై వేయకుండా వాటిని గ్రీన్ అంబాసిడర్ వచ్చే వరకు డస్ట్‌బిన్‌లో ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జేవీఆర్ రమేష్, జగ్గంపేట ఈవోపీఆర్డీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి శివా, సచివాలయ సిబ్బంది, కార్యదర్శి శివ పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆఫీస్ వద్ద సీడీపీవో ఎం.పూర్ణిమ అధ్యక్షతన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ సూర్యభాస్కరరావు, వెలుగు ఏపీఎంటి, ప్రశాంతి పాల్గొని ర్యాలీ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు ఆధ్వర్యంలో స్వచ్ఛంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కర్ణాకుల పెద్దకాపు, ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు, హెచ్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.


జగ్గంపేటలో షాపుల వద్ద చెత్తను యజమానులతో తీయిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తుని రూరల్(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తుని ఎంపీడీవో సాయి నవీన్ అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరం గ్రామ పంచాయతీలో ఎంపీపీతో కలిసి ఆయన స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పోలిశెట్టి రామలింగేశ్వరరావు, వంగలపూడి వాసు, కంటిపాటి రమణ, బండారు లక్ష్మణరావు, మట్ల గణేష్, తుమ్మలపల్లి నాని, చోడిశెట్టి శివరాం పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో క్యారీ బ్యాగుల పంపిణీ

తుని ఏరియా ఆసుపత్రిలో క్లాత్ క్యారీ బ్యాగులు పంపిణీ కార్యక్రమం సూపరింటిండెంట్ స్వప్న అధ్యక్షతన నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ డాక్టర్ గంటలు చిన్నారావు పాల్గొని క్లాత్ బ్యాగులను ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఉచితంగా పంపిణీ చేశారు.

'ఆదిత్య'లో రేపటి నుంచి

ప్రో కార్టింగ్ ఎండురన్స్ చాంపియన్ షిప్ 2025

గండేపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ ఛాంపియన్ షిప్ 2025 సీజన్ 5 ఈనెల 17 నుంచి 19వరకు జరుగుతుందని ఆదిత్య విశ్వవిద్యాలయం ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. మన రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ, చెన్నై, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అనేక కళాశాలలు ఈ పోటీల్లో పాల్గొంటాయన్నారు. విజేతలకు రూ.4లక్షలు నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు వసతి, భోజన సదుపాయాలు సమకూర్చడం జరిగిందన్నారు. అసౌకర్యం జరగకుండా పూర్తి పారదర్శకంగా పోటీలు నిర్వహించే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్

తొండంగి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో శనివారం అకడమిక్ ఆడిట్ నిర్వహించి దస్త్రాలు పరిశీలించారు. పీఆర్ డిగ్రీ కళాశాలలకు చెందిన జి.చక్రవర్తి, కొత్తపేట డిగ్రీ కళాశాలకు చెందిన కె.ఎస్ఎన్.ప్రసాద్ పరిశీలకులుగా హాజరయ్యారు రెండేళ్లలో జరిగిన అకడమిక్ అంశాలు, అభివృద్ధి కార్యక్రమాల రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్, వైస్ ప్రిన్సిపాల్ దివాకర్, వి.నారాయణ, పివికృష్ణారావు తదితరులు ఉన్నారు.

ఆంధ్రా భద్రాద్రి క్షేత్రానికి విరాళం

ప్రత్తిపాడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని నరేంద్రగిరి కొండపై అభివృద్ధి చెందుతున్న ఆంధ్రభద్రాద్రి శ్రీరామ క్షేత్రానికి కాకినాడకు చెందిన విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి డీఎల్ఎన్ శాస్త్రి, సుబ్బలక్ష్మి దంపతులు కుమారులుశివరాం, సత్యతేజలు కలిసి శనివారం రూ.50వేలను భద్రాద్రి కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు దాట్ల పుష్పారెడ్డి, గోగుల వెంకటేశ్వరరావు, పత్రిరమణ, నాగా ఆంజనేయులు, దాతలకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో శ్రీరామ సేవక్ సభ్యులు నేతి శ్రీనివాస్, వనపర్తి గణేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సోము వీర్రాజును కలిసిన బీజేపీ నాయకులు


ఎమ్మెల్సీ సోమును సన్మానిస్తున్న ప్రత్తిపాడు బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఎన్నికైన సోము వీర్రాజును శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ నాయకులు కలిసి అభినందించారు. రాజమహేంద్రవరంలోని సోము వీర్రాజు స్వగృహానికి నియోజకవర్గంకు చెందిన బీజేపీ కాకినాడ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు, జిల్లా యువ మోర్చ అధ్యక్షుడు పాపారావు, బీజేపీ ప్రత్తిపాడు మండలా ధ్యక్షుడు ఊటా వీరబాబులు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్ళి సోము వీర్రాజుకు శాలువా కప్పి సన్మానించారు. కాకినాడ జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కారానికి శాసన మండలిలో వాణి వినిపించాలని వీర్రాజును కోరారు. కార్యక్రమంలో రౌతులపూడి, ప్రత్తిపాడు మండల బీజేపీ నాయకులు లోడు శ్రీనివాసు, వి.వీరబాబు, గొనగాని గంగా గోపాలస్వామి, ఇనుముల రాజా, నానిపల్లి శ్రీనివాస్,మాణిక్యం పాల్గొన్నారు.

కాలక్షేపంగా కౌన్సిల్ సమావేశం


• అధికారుల తీరుపై మండిపడిన కౌన్సిలర్లు • సమావేశం వాయిదా

ఏలేశ్వరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం నగర పంచాయతీ సమావేశం కాలక్షేపంగా అధికారులు నిర్వహిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు మండి పడ్డారు. శనివారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలోని అంశా లను సీనియర్ అసిస్టెంట్ శేషురాజు చదువుతుండగా కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్ మాట్లాడుతూ కౌన్సిర్లకు సమాచారం ఇవ్వకుండా మహాశివరాత్రికి సంబంధించిన పనులు చేపట్టారని, బిల్లులు ఆమోదించేది లేదనడంతో ఏఈ అనూష నెమరువేశారు. గత సమావేశంలో కౌన్సిలర్లు అడిగిన అంశాలకు అధికారులు సమాధానం చెప్పిన తరువాత సమావేశాన్ని ప్రారంభించాలని కౌన్సిలర్లు కమిషనర్‌ను కోరారు. అధికారుల దగ్గర నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో నగర పంచాయతీకి ఆదాయం వచ్చే ఖాళీ స్థలాలకు పన్నులు విధించడంలో అధికారులు విఫలమయ్యారని గోవింద్ అన్నారు. కౌన్సిలర్లు సామంతుల హైమావతి, సుంకర హైమావతి మాట్లాడుతూ వార్డుల్లో కోతులు, కుక్కల బెడద అధికంగా ఉందని సమావేశంలో సమస్యలపై ఎన్నిసార్లు చర్చించినా అధికారుల్లో మార్పులు రావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. తూతూ మంత్రంగా ప్రతీ నెల సమావేశం నిర్వహించి కాలయాపన చేస్తున్నారు తప్ప సమస్యలపై దృష్టిసారించడంలేదని పలువురు కౌన్సిలర్లు మధ్యలో వెళ్లిపోయారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు.

రాజగోపాలస్వామికి పుష్పయాగం

ప్రత్తిపాడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో రుక్మిణి సత్యభామ సమేత కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీ పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అంగర లక్ష్మీనరసింహచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లను ఊయలపై ఆశీనులు గావించి పవళింపు సేవ నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

గిరిజన సహకార సంస్థ గోదాముల్లో జేసీ తనిఖీ


జీసీసీ గోదాముల్లో తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

రంపచోడవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలోని గిరిజన సహకార సంస్థ గోదాము లను అల్లూరి జిల్లా కలెక్టర్ అభిషేక్ గౌడ శనివారం తనిఖీ చేశారు. గిరిజన సహకార సంస్థలకు సివిల్ సప్లయిస్ కోసం వస్తున్న సరుకులు, వాటి లెక్కలు, గోదాములలో ఉన్న రికార్డులు, తదితర అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల ప్రకారం వచ్చిన స్టాకుతో భౌతికంగా ఉన్న స్టాకు సరిపోయిందా లేదా అన్నది పరిశీలించారు. ఈయనతోపాటు రంపచోడవరం తహశీల్దార్ రామకృష్ణ, సివిల్ సప్లయిస్ అధికారులు, జీసీసీ అధికారులు ఉన్నారు.

'సమన్వయంతో పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం'

మారేడుమిల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అన్నిశాఖల అధికారులు, వ్యాపారస్తులు ముందుకు రావాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో తూతిక శ్రీనివాస్‌విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన స్వచ్ఛంధ్రా స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీపీ సార్ల లలిలకుమారి, వైస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్, స్పెషల్ ఆఫీసర్ చైతన్య, తహశీల్దార్ బాలాజీ, వ్యాపారస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవీపట్నం: స్థానిక వెలుగు కార్యాలయం వద్ద శనివారం ఎంపీడీవో డీఎన్ రత్నకుమారి, తహశీల్దార్ కె.సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ ఐ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో ఆర్.ప్రశాంతి, ఏపీవో వి.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎండీ రజాక్, ఏపీఎం బత్తిన అప్పలకొండ, ఐసీడీఎస్ సిబ్బంది, టీడీపీ మండలాధ్యక్షుడు ఎం.బుజ్జిబాబు, ముచ్చు చిన్ని, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలిద్దామని రంపచోడవరం డిప్యూటీ కలెక్టర్ మండల స్పెషల్ ఆఫీసర్ బి.అంబేద్కర్ అన్నారు. శనివారం స్థానిక సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి అధ్యక్షతన అధికారులు స్థానిక వర్తకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో యాదగిరేశ్వరరావు, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంఈవో సత్యనారాయణదొర, సీడీపీవో దేవమణి, ఏపీవో రెడ్డిబాబు, సచివాలయ సిబ్బంది, గొల్లపూడి పెద్దిరాజు, కనిగిరి వీరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూనవరం: ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని కూనవరం సబ్ డివిజనల్ ఫారెస్టు అధికారి కేవీఎస్ రాఘవరావు పిలుపునిచ్చారు. కూనవరం రేంజ్ పరిధిలోని నాగులమ్మతల్లి గద్దె సమీపంలో ఉన్న ప్లాస్టిక్ నిర్మూలనపై ఈసందర్భంగా భక్తులకు అవగాహన కల్పించారు. డీఆర్వో అనిల్, ఎఫ్ఎస్ఓ సాయి, విజయలక్ష్మి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న సూర్యచంద్ర

సీఎం నుంచి అవార్డు అందుకున్న పాటంశెట్టి సూర్యచంద్ర

కిర్లంపూడి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తణుకులో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కిర్లంపూడి మండలంలోని బూరుగుపూడి గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్రకు సీఎం చంద్రబాబు అవార్డు ప్రదానం చేశారు. గతంలో బూరుగుపూడి సర్పంచ్‌గా పనిచేసినప్పుడు సూర్యచంద్ర చేసిన సేవలు గుర్తించి ఆయనకు అవార్డు ప్రదానం చేయడం జరిగింది. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనకు విజన్ 2047 నిర్మాణానికి కృషిచేయాలని సూర్యచంద్రను సీఎం చంద్రబాబు కోరారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశయ సాధన కోసం స్వచ్ఛాంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషిచేస్తానని సూర్యచంద్ర స్పష్టం చేశారు.

వేంకటేశ్వరుడి కల్యాణం

కిర్లంపూడి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఏడవ కల్యాణ మహోత్సవం పెంటకోట నాగబాబు, సత్యవేణి దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ప్రత్తిపాడు వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు హాజరయ్యారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు.


సిందూర పూజ నిర్వహిస్తున్న దృశ్యం

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

జగ్గంపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో మార్చి 10 నుంచి శనివారం ఉదయం 6.30గంటల వరకు మహిళలు సుందరకాండ పారాయణం చేశారు. 8.30గంటలకు ఆంజనేయ స్వామివారికి మన్యుసూక్తి పారాయణ పూర్వక అభిషేక సహిత తమలపత్ర, సింధూర పూజా కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, నాగలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు చక్రవర్తులు రాఘవాచార్యులు, జీను మణిబాబు, దాట్ల సురేష్‌రాజు, గెడ్డమూరి బాబ్జి పాల్గొన్నారు.

జన సైనికులకు ధన్యవాదాలు

జగ్గంపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శుక్రవారం జరిగిన 12వ ఆవిర్భావ సభకు వచ్చిన జనసేన నాయకులు, కార్యకర్తలకు జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఒకప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గం నుంచి సుమారు 15వేల మంది తరలివెళ్లామన్నారు. అందరికీ భోజనం, మంచినీరు కావలసిన ఏర్పాట్లు రామచంద్రపురం గ్రామంలో ఏర్పాటు చేసి వారి తిరిగి ఇంటికి వెళ్లే వరకు ఆవిర్భావ కో ఆర్డినేటర్ అక్కల గాంధీ, శ్యాం సుధాకర్, నాయకులు పర్యవేక్షించామన్నారు.

'బహుజన బాంధవుడు కాన్షీరామ్'

శంఖవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బహుజనులకు రాజ్యాధికారం కోసం కాన్షీరామ్ ఎంతగానో కృషి చేశారని బహుజన సమాజ్ పార్టీ ప్రత్తిపాడు అధ్యక్షుడు గునపర్తి అపురూప్ అన్నారు. శనివారం కాన్షీరామ్ జయంతి సందర్భంగా శంఖవరంలో కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు కొంగు రమేష్, ప్రధాన కార్యదర్శి బత్తిన తాతాజీ, శంఖవరం అధ్యక్షుడు గునపర్తి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

హంసవరంలో...

తుని రూరల్: కాన్షీరామ్ జయంతిని హంసవరంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తంతిటి కిరణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాజబాబు, కర్రి నూకరాజు, చెక్క భీమరాజు, ములికి వీరబాబు, మచ్చా సుబ్బారావు పాల్గొన్నారు.